


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



*సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి-అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.*

*హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పదుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)*

*అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.*

# మాయాబజార్

## (గత సంచిక తరువాయి)

శకుని(నివారిస్తున్నట్లు నటిస్తూ) శాంతించండి. తమరు పెద్దలు. అందరి శుభం కోరేవారు.

(బలరాముడు ఆసీనుడౌతాడు. దుశ్శాసనుడు,కర్ణుడు వింజామరలు వీస్తూ వుంటారు.) మీకు చెపితే కాస్త భయం తీరుతందని చెప్పానేకాని...

దుర్యోధనుడు: గురుదేవా. ఈ భయాలు, ఈ ఈర్ష్యలు నాకెందుకు? ఈ జూదంలో నాకు సంక్రమించిన రాజ్యం యావత్తు గురుదక్షిణగా మీకు సమర్పిస్తాను. వారి రాజ్యం వారికిచ్చెయ్యండి. ఈ వైరానికి శాంతి కల్పించండి.

బలరాముడు(కోపంగా): అనవసరం. అపాత్రదానం కూడా మహాపాపం.(నీతికోవిదుడు) దుర్యోధనా. నీ వితరణశీలానికి మెచ్చి నీకు వరమిస్తున్నాను. కోరుకో.

శకుని: ఆఁ. లక్ష్మణకుమారా. సమయానికి వచ్చావు. రా నాయనా. గురుదేవుల పాదాలకు నమస్కరించు.

బలరాముడు(సంప్రీతుడై మందహాసంతో ) : కల్యాణ ప్రాప్తిరస్తు. దుర్యోధనా.వినయంలో నిన్నే మించాడే నీ కుమారుడు?

శకుని: పెద్దలంటే గౌరవం. తండ్రి ఎదుట తలే ఎత్తడు. ఇక తమరంటే అలవికాని గౌరవం.

బలరాముడు: అదే ఉత్తమపురుష లక్షణం. భావి సామ్రాజ్య ప్రతినిధి. లే నాయనా. (లక్ష్మణుడు లేవడు). ఏమి కావాలి?

శకుని: చిరంజీవికి చిరకాల వాంచ. మీ శశిరేఖని తన పట్టమహిషిని చేసుకుందాంఁవని తపస్సు చేస్తున్నాడు. మీరు కటాక్షించండి.

బలరాముడు: అంతకంటేనా / లే నాయనా.

ద్వారకలో బలరాముని భవనం. శ్రీకృష్ణుడు, సుభద్ర,అభిమన్యుల రథం ప్రవేశిస్తుంది. రేవతి చెలికత్తె చూసి లోనికి పోతుంది. శశిని వెంటబెట్టుకుని రుక్మిణి వస్తుంది.––

రుక్మిణి: రా సుభద్రా.(నమస్కరించిన అబిమన్యునితో) కల్యాణమస్తు.––యువ అభిమన్యు,శశిరేఖల ప్రథమ వీక్షణం. ఇద్దరూ పరస్పరం ప్రేమగా చూసుకుంటారు.

సాత్యకి: పాండవులంతా కుశలమేనా అన్నయ్యా?

శ్రీకృష్ణుడు: ప్రతాపవంతులకు ఎక్కడున్నా సుఖమే!——(శశి సుభద్రకి నమస్కరిస్తుంది.) శశీ.చూశావా నీ బావ సత్యవంతుడైనాడు.

రుక్మిణి: ఆయన సత్యవంతుడైతే ఈవిడ సావిత్రి ఔతుంది. (రచయిత ప్రతిభ– నటి సావిత్రి అని ధ్వని).మా అమ్మాయేం తక్కువది కాదు.

సుభద్ర: పెద్దవదిన కనిపించలేదు. కులాసాగావుందా?

రిక్మిణి: ఆవిడొక సత్యకాలపు మనిషి. రాజ్యం పోయింది మీకు కాదు తనకన్నట్లు విచారిస్తోంది.

శ్రీకృష్ణుడు: మనం ఉత్సాహంగావుంటే ఆవిడా ఉత్సాహంగా వుంటుంది. పదండి. రా నాయనా.

అక్కడ అంతఃపురంలో–రేవతితో చెలికత్తె: సుభద్రాదేవిగారిని చూడగానే నాకే జాలి వేసింది అమ్మగారు. వెనకటి వైభవమే లేదు. ఏ ఆభరణాలు లేకుండా వట్టి నారచీరలతో వచ్చారమ్మా.

రేవతి: హుఁ! ఎంత చేసుకున్నవాళ్ళకి అంత! —ప్రతీహారి:మహారాణీ, సుభద్రాదేవిగారు వస్తున్నారు. —నిష్క్రమిస్తాడు. —రేవతి పూలదండ పారేసి తలకి గుడ్డ కట్టించుకుని శయ్యపైకి చేరి: చంపా. హుఁ...మూలుగుతున్న రేవతికి సుభద్ర నమస్కరిస్తుంది.

రేవతి: ఏమమ్మా వచ్చావా. కూర్చో అమ్మా. అదేం గ్రహచారమో నువ్వొచ్చేవేళకే నాకీ శిరోభారం పట్టుకుంది.

సుభద్ర: ముందు ఇక్కడికే వద్దామనుకుంటే చిన్నన్నయ్య,రుక్మిణి వాళ్ళింటికి తీసుకువెళ్ళారు.

రేవతి: మాకా పట్టింపులేం లేవు.

సుభద్ర: ఎక్కడున్నా మా భోగాలకేం లోటులేదు వదినా. నువ్వేం విచారించకు. అన్నయ్య ఎప్పుడొస్తాడొ తెలిసిందా?

రెవతి: ఏమో? నన్నడిగి వెళ్ళారా? నాతో చెప్పి వస్తారా? అసలే కోపదారి. ఎక్కడ ఎవరితో పెట్టుకున్నారోనని అదో భయంగా వుంది. అబ్బా!——తలపట్టుకుంటుంది.

సుభద్ర: వదినా నువ్వు చాలా బాధపడుతున్నావుగాని.(వ్యంగ్యం) కాస్త విశ్రాంతి తీసుకో. అన్నయ్య రాగానే వస్తాను.

పాట–5.

ఉద్యానవనంలో ధనుర్బాణాలు ధరించి అభిమన్యుడు:

చూపులుకలసిన శుభవేళా/ ఎందుకు నీకీ కలవరము?

ఎందుకు నీకీ కలవరము?

ఉల్లాసముగా నేనూహించిన అందమె నీలో చిందెనులే...

చూపులుకలసిన శుభవేళా /ఎందుకు నీకీ కలవరము?

ఎందుకు నీకీ కలవరము?

శశిరేఖ: చూపులుకలసిన శుభవేళా/ ఎందుకు నీకీ కలవరము?

ఎందుకు నీకీ పరవశము?

ఏకాంతములో ఆనందించిన/ నా కలలే నిజమాయెనులే

చూపులుకలసిన శుభవేళా /ఎందుకు నీకీ కలవరము?

ఎందుకు నీకీ పరవశము?

అభి: ఆలాపనలు సల్లాపములు /కలకల కోకిల గీతములే;

ఆలాపనలు సల్లాపములు /కలకల కోకిల గీతములే

చెలువములన్నీ చిత్ర రచనలే/చెలువములన్నీ చిత్ర రచనలే

చలనములోహో నాట్యములే...

చూపులుకలసిన శుభవేళా /ఎందుకు నీకీ కలవరము?

ఎందుకు నీకీ కలవరము?

(రేవతి మేడపైనుండి చూస్తుంది.)

శశి: శరములవలెనే చతురోక్తులను/ చురుకుగ విసిరే నైజములే

శరములవలెనే చతురోక్తులను/ చురుకుగ విసిరే నైజములే

ఉద్యానములో వీరవిహారమె(చతురోక్తి) /ఉద్యానములో వీరవిహారమె

తెలిపెదనోహో శౌర్యములే ...

చూపులుకలసిన శుభవేళా/ ఎందుకు నీకీ కలవరము?

ఎందుకు నీకీ పరవశము?

అభి: ఎందుకు నీకీ కలవరము?

(నేపథ్యంలో రేవతి: శశీ?)

చెలికత్తె చంప: శశిరేఖమ్మగారూ. అమ్మగారు మిమ్మల్ని వెంటనే రమ్మన్నారు. –నిష్క్రమిస్తుంది.

అభి: రేపే పౌర్ణమి. నౌకావిహారం మాట మరచిపోకు. –శశి చిరునవ్వుతో నిష్క్రమిస్తుంది.

భవనంలో——శశి: ఏంటమ్మా? తలనొప్పిగావుందా?

రేవతి: నువ్వు చేసే పనులకి తలనొప్పిగానేవుంది(శ్లేష) తోటలోపడి మీరిద్దరు ఆ గంతులేమిటి చెప్పు?

శశి: ఏమమ్మా.బావతో ఆడుకుంటే?

రేవతి: బావ,నువ్వు ఇంకా పసిపిల్లలనుకుంటున్నారా? ఈడొచ్చిన పిల్లవు. ఇలా తిరుగుతుంటే నలుగురూ నవ్వరూ? అందరూ తప్పు పట్టరూ? ఎంత అప్రతిష్ఠ?

శశి; నన్నేం చెయ్యమంటావేమిటి?

రేవతి: ఆ బావతో నీ విహారాలింక మానెయ్యమంటాను. అతనితో అసలు మాట్లాడటమే వద్దంటాను. బుద్ధిగావుండి నా కూతురని చెప్పుకోమంటాను. తెలిసిందా? –శశి తల్లి చూడకుండా వెక్కిరించి వెళ్ళిపోతుంది. (పసితనం ఇంకా పోలేదని అర్థం)

రుక్మిణి మందిరంలో – సుభద్ర కన్నీరు పెట్టుకుంటుంది.

రుక్మిణి: సుభద్రా. ఏమిటమ్మా?

సుభద్ర : ఏముంది? చెడి పుట్టిల్లు చేరకూడదంటారు.(సామెత) పెద్దొదినగారి పరామర్శ చూసిన తర్వాత ఇక్కడికెందుకొచ్చానా అనిపిస్తుంది.

రుక్మిణి: ఏమిటి సుభద్రా ఇది? ఆవిడగారి సంగతి తెలుసుగా? రేపు బావగారు వచ్చిన తర్వాత ఆవిడ బుద్ధి మారిపోతుంది. పద అన్నయ్య(శ్రీకృష్ణుడు) నీకోసం ఎదురు చూస్తున్నారు.

బలరాముడు రేవతికి తాను తెచ్చిన కానుకలు చూపుతుంటాడు. రేవతి మురిసిపోతుంది.

బలరాముడు: ఇదంతా దుర్యోధన చక్రవర్తికి నాయందుగల భక్తి. నాకెంత సత్కారం చేశారు? ఎంత బ్రహ్మరథం పట్టారు? (సంతుష్టి) అతని బుద్ధికి మెచ్చి నేనొక వరం ఇచ్చాను.

రేవతి: ఏం కోరారు? ఏం వరమిచ్చారు? కాస్త నాక్కూడా చెప్పండీ?

బలరాముడు: ఈ రేవతి మహారాణి ముద్దుల కుమార్తెను భావి సామ్రాట్టు లక్ష్మణకుమారునికి ఇచ్చి వివాహం చెయ్యమని ప్రాధేయపడి అడిగారు.(అమాయకత్వం) సరే అన్నాను. కాని సుభద్ర ఏమనుకుంటుందో అని !

రేవతి: సుభద్రకేం? ఏమైనా అనుకుంటుంది. మన అమ్మాయి అదృష్టం బాగుందిగనకనే వారు కోరడం, మీరు మాటివ్వడం జరిగాయి. లగ్నం నిశ్చయమయ్యేవరకు మౌనంగా ఉండండి.

బల: ఏం?

రేవతి: మీకేం తెలీదు. ఆ సుభద్రకి తెలిస్తే ఇప్పుడే రచ్చ చేస్తుంది.

బల: ఓహో.సరే!

రేవతి–వస్తున్న శశిరేఖని చూసి: రా.తల్లీ రా.

బల: రా తల్లీ. ఈ కానుకలు నీకు భానుమతీదేవి పంపించింది.

శశి: నాకొద్దులే నాన్నా.

రేవతి: అలా అనరాదు తీసుకో.

శశి: నాకు కానుకలు పంపడానికి ఆవిడెవరు? తీసుకోడానికి నేనెవర్ని? (తర్కం,వాస్తవం)

రేవతి: చూశారా. దీని తలబిరుసు?

బల: అదేమిటమ్మా? వాళ్ళూ మనకు కావలిసినవాళ్ళే.

శశి: ఎట్లా అవుతారు నాన్నా? నేనుమాత్రం తీసుకోను. –అని వెళ్ళిపోతుంది.

రేవతి: మీరూరుకోండి. ఆ పిచ్చి నేను కుదురుస్తాను. –బలరాముడు ఆందోళన చెందుతాడు. –శశి గదికి వెళ్ళి రేవతి: ఏమిటి నీ అహంకారం? నాన్నగారి మాటలుకూడా లక్ష్యం చెయ్యకుండా వస్తావా?

శశి: ఆ తుచ్ఛులు కానుకలు పంపి మనని అవమానించారు.

రేవతి: నీకీ బుద్ధులన్నీ ఎవరు నేర్పించారు? ఆ రుక్మిణీ సుభద్రలేనా? నీవు ఈ రోజునుంచీ వాళ్ళు ఎవరితో మాట్లాడవద్దు. –రేవతి వెళుతూ బయట గొళ్ళెం పెడుతుంది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments